RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక


THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 385 | 26 మంగళవారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# ఇంధన ధరల పెంపు..

## ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం



### : నిర్మలా సీతారామన్

- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్



దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

రాహుల్‌కు పరోక్ష కౌంటర్

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

'3-ఎఫ్' ఫార్ములా

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.

భయాందోళనలు వద్దు

ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## అలాంటి వారిని నేరాలు చేయాలంటేనే భయపడేలా శిక్షించాలి

### : సీఎం విజయ్



తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విషయంలో కేసులను తక్షణమే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర సచివాలయంలో శాంతిభద్రతలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

కేసుల నమోదులో జాప్యం వద్దు.. నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి

ఈ సమావేశంలో సీఎం విజయ్ మాట్లాడుతూ.. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో జాప్యం జరగకూడదని అన్నారు. చట్టపరమైన చర్యలను అనుసరించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడితే, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఇతరులు భయపడతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తు సంస్థలు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం కూడా చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. సాయికుమార్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్, డీజీపీ డాక్టర్ సందీప్ రాయ్ రాథోడ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల భద్రతపై ప్రజా స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.

## 'రైతు గోస – బీజేపీ భరోసా' యాత్ర

### : రఘునందన్ రావు



రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు. ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్



2

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్

### : రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు

- ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు
- రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కళ్లాల్లోనే ఉందని ఆవేదన
- రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్



2

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 మంగళవారం మే 2026

# బీఆర్ఎస్‌ను తేలుతో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



బీఆర్ఎస్ పార్టీ విధానాలు వెనక నుంచి కాటు వేసే తేలు లాంటివని, అలాంటి పార్టీని చెప్పుతో కొట్టి చంపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, ఆ పార్టీ కేవలం కొన్ని మీడియా, సోషల్ మీడియాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు.

'సారు.. కారు.. 16' అని ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని రాంచందర్‌రావు విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీ వద్దకు వంద సార్లు వెళ్లి నిధులు తెచ్చుకుంటూ, బయట మాత్రం కేంద్రం సహకరించడం లేదని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ కూడా ఇదే విధంగా వ్యవహరించి ప్రజలతో తిరస్కారానికి గురయ్యారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని రాంచందర్‌రావు మండిపడ్డారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలులో పూర్తిగా విఫలమైందని, కనీసం గోనె సంచులు, లారీలు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు పడితే, కాంగ్రెస్ పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో, గోదావరి బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి రాంచందర్‌రావు బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై ఎన్‌డీఎస్‌ఏ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఫల్టాలో బీజేపీ ప్రభంజనం..

## ప్రజాస్వామ్యం గెలిచిందన్న ప్రధాని మోదీ



పశ్చిమ బెంగాల్‌లోని ఫల్టా అసెంబ్లీ నియోజకవర్గ రీపోలింగ్‌లో బీజేపీ చారిత్రక విజయం సాధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య విజయమని, బెదిరింపు రాజకీయాలు ఓడిపోయాయని వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఏకంగా లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో గెలవడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా 1,49,666 ఓట్లు సాధించి, సమీప సీపీ(ఎం) అభ్యర్థి శంభు నాథ్ కుర్మీపై 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. కుర్మీకి 40,645 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్ మొల్లాకు 10,084 ఓట్లు పోలయ్యాయి. అధికార టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ కేవలం 7,783 ఓట్లతో నాలుగో స్థానానికి పరిమితమై డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.

ఈ గెలుపుపై ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ "ఫల్టా ప్రజలు తమ తీర్పు ఇచ్చారు. రికార్డు మెజార్టీతో గెలిచిన దేబాంగ్షు పండాకు అభినందనలు. పశ్చిమ బెంగాల్ ప్రజలకు బీజేపీ ప్రభుత్వంపై ఉన్న అచంచల విశ్వాసానికి ఇది నిదర్శనం" అని పేర్కొన్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందిస్తూ.. ఫల్టా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, టీఎంసీ ఒక మాఫియా కంపెనీగా మారిందని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ 29న జరిగిన పోలింగ్ సందర్భంగా ఈవీఎంలపై పెర్ఫ్యూమ్ వంటి ద్రవ్యం చల్లడం, ఇంక్ మరకలు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో ఎన్నికల సంఘం మొత్తం 285 బూత్‌లలో మే 21న రీపోలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. భారీ భద్రత నడుమ ఈ రీపోలింగ్ జరిగింది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు టీఎంసీ అభ్యర్థి తాను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించినా, నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ఆయన పేరు ఈవీఎంలో కొనసాగింది.

### బెంగాల్‌లో ఫాల్టా రీపోలింగ్‌లో బీజేపీ ఘనవిజయం...

# టీఎంసీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతు



పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.

ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఫాల్టా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. అలాగే, 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి. ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్టా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. బీజేపీ అభ్యర్థికి సంబంధించిన ఈవీఎం బటన్‌పై టేపులు వేయడం, వందలాది మంది ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు సుబ్రతా గుప్తా విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మే 21న ఫాల్టా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్‌కు ఆదేశించింది. ఈ విజయంతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ సభ్యుల సంఖ్య 208కి చేరింది. తృణమూల్ బలం 80గా ఉంది.

# విశాఖలో ఘనంగా బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకం ఆవిష్కరణ



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత ప్రస్థానాన్ని ఆవిష్కరించే 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ సభ విశాఖపట్నంలో అత్యంత వైభవంగా జరిగింది. విశాఖ మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ అవలోకన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దత్తాత్రేయ రాజకీయ జీవితం, ఆయన చేసిన ప్రజా సేవ, సామాన్య ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ... సామాన్య ప్రజల మధ్య నుంచి ఎదిగి, గవర్నర్ వంటి అత్యున్నత పదవిని అధిరోహించిన బండారు దత్తాత్రేయ జీవిత ప్రయాణం నేటి యువతకు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎదురైన క్షేత్రస్థాయి అనుభవాలు, ప్రజలు అందించిన ఆశీర్వాదాలే తన జీవితానికి అసలైన బలమని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజలతో ఉన్న ఆ బంధం వల్లే ఈ పుస్తకానికి 'ప్రజల కథే నా ఆత్మకథ' అనే పేరును ఖరారు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఒక నిబద్ధత కలిగిన నాయకుడి ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ఈ పుస్తకం ద్వారా రాబోయే తరాలకు అందుబాటులోకి రానుంది.

# ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

## కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్



తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# రేవంత్‌కు మోదీ ఆఫర్..

## భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడొచ్చు

### : ధర్మపురి అర్వింద్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆఫర్ ఇస్తే ఎవరూ కాదనలేరని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఒక ఛాన్స్ ఇచ్చారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేలకు ఇచ్చిన తరహాలోనే రేవంత్‌రెడ్డికి కూడా మోదీ ఆఫర్ ఇచ్చి ఉండవచ్చని, ఈ ప్రతిపాదనను తిరస్కరించినందుకు భవిష్యత్తులో రేవంత్ పశ్చాత్తాపపడాల్సి రావచ్చని వ్యాఖ్యానించారు.

ఇక పార్టీ అంతర్గత వ్యవహారాలు, వివాదాలపై కూడా అరవింద్ ఓపెన్‌గా స్పందించారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌తో ఉన్న విభేదాలపై మాట్లాడుతూ.. పార్టీలో అభిప్రాయ భేదాలు సహజమని, అయితే తాను ఎవరిపైనా అధిష్ఠానానికి ఫిర్యాదులు చేయలేదన్నారు. అలాగే బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వెనుక తన హస్తం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు, ఆ ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదన్నారు. పోక్సో కేసు నమోదైన తర్వాత తాను బండి సంజయ్ తో మాట్లాడలేదని చెప్పారు. గతంలో తానే రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలని కోరానని, అయితే కొత్తగా పార్టీలోకి రావడంతో అది కుదరదని అధిష్ఠానం తేల్చి చెప్పినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధికారంలోకి వస్తున్నా, తెలంగాణలో మాత్రం అధికారం చేరువలో కనిపించకపోవడానికి స్థానిక నాయకత్వ సమస్యలే కారణమని అర్వింద్ అంగీకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ తరహాలో పెద్ద గ్రూప్ లీడర్లు లేకపోవడం తమ పార్టీకి ప్రధాన సమస్యగా మారిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో తాము అధికారంలోకి రాకపోవడం తమ పార్టీ తప్పేనని, ప్రజలు ఆ సమయంలో తమను కోరుకోలేదన్నది నిజమని ఆయన స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని సగం క్యాబినెట్‌లో క్వాలిటీ కాంగ్రెస్ లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర పనిచేసేందుకు మంత్రులే ఇష్టపడటం లేదని అన్నారు.

# నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్

## : రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు



తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు.

రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కల్లాల్లోనే ఉండిపోవడం, రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. "తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ జాప్యం వల్ల వరి కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ధాన్యాన్ని 'మిషన్ మోడ్'లో కొంటున్నామనే సీఎం వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఇది మిషన్ మోడ్ కాదు, పూర్తిగా 'కమీషన్ మోడ్' అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. 45 రోజుల్లో రైతుబంధు నిధులు వేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి, 60 రోజులు గడిచినా వేయకుండా మాట తప్పారని, రేవంత్ రెడ్డి కేవలం ఒక "పేపర్ టైగర్" మాత్రమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి తన ఢిల్లీ ట్రిప్పులను పక్కనబెట్టి, కళ్లాల్లో ఉన్న వడ్లను తరలించడానికి లారీల ట్రిప్పులను పెంచాలని హితవు పలికారు.

రాజకీయ విమర్శలు పక్కనబెట్టి రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే, స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని స్పష్టం చేశారు. అలాగే వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 మంగళవారం మే 2026

# బీసీ సంక్షేమ శాఖలో సెక్రటరీ, కమీషనర్లుగా బీసీలనే నియమించాలి

### బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్



హైదరాబాద్, మే 25: బీసీ సంక్షేమ శాఖలో సెక్రటరీ, కమీషనర్లుగా బీసీలనే నియమించాలని బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖలో రెండు సంవత్సరాలుగా పూర్తి స్థాయి అధికారులను నియమించడం లేదని, ఇంచార్జీలతో కాలయాపన చేస్తుండటంతో బీసీల సమస్యలు పెండింగ్ లోనే ఉంటున్నాయని పేర్కొన్నారు. నాన్ బీసీగా ఉన్న బీసీ వెల్ఫేర్ కమీషనర్ నాన్ బీసీ అధికారులను ప్రోత్సహిస్తూ.. బీసీ ఉద్యోగులను వేదిస్తున్నారని ఆరోపించారు. బీసీ రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీగా, బీసీ కార్పొరేషన్ ఎండిగా, బీసీ సంక్షేమ శాఖలోని పెద్ద పోస్టులన్ని బీసీ వ్యతిరేకులైన నాన్ బీసీలను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖను భ్రష్టు పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మైనార్టీ శాఖలో మొత్తం మైనార్టీలను, ఎస్సీ వెల్ఫేర్ ఎస్సీలను, ఎస్టీ వెల్ఫేర్ లో ఎస్టీలను నియమిస్తూ బీసీల వెల్ఫేర్ లో మాత్రం బీసీలను నియమించకుండా నాన్ బీసీలనే ఎందుకు నియమిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారులు బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుంటే మంత్రులు మౌనంగా ఎందుకు ఉంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వంగా బీసీలను అణగదొక్కేందుకే నాన్ బీసీలకు ప్రాధాన్యతనిస్తూ బీసీలను పూర్తిగా విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. బీసీల పట్ల సీఎంకు చిత్తశుద్ధి ఉంటే బీసీ సంక్షేమ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీ, కమీషనర్, ఎండి తదితర పోస్టుల్లో బీసీ ఉన్నతాధికారులను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు గడ్డిగొల్ల అనంతయ్య, నీల వెంకటేష్, గోరిగె మల్లేష్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, మోడీ రాందేవ్, శివకుమార్ యాదవ్, భీంరాజ్, అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మే 30న క్రమశిక్షణ కమిటీ ముందుకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి : మల్లు రవి



పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన అంతర్గత విభేదాల పరిష్కారానికి అధిష్ఠానం రంగంలోకి దిగింది. పార్టీ బలోపేతం కోసం నేతలు, క్యాడర్ అంతా కలిసి పనిచేయాలని ఎంపీ, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిణామాలపై హైదరాబాద్‌లో స్థానిక నేతలతో భేటీ అయిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ వివాదానికి సంబంధించి ఝాన్సీ రెడ్డి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారని, అయితే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండటం వల్ల రాలేకపోయారని తెలిపారు.ఎమ్మెల్యే తిరిగొచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి మే 30వ తేదీన కమిటీ ముందుకు హాజరుకావాలని సూచించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. పాలకుర్తిలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌లపై ఎమ్మెల్యే వర్గం ఫిర్యాదు చేయగా.. మరోవైపు ఎమ్మెల్యే, ఝాన్సీ రెడ్డిలు క్యాడర్‌ను పట్టించుకోకుండా వేధిస్తున్నారంటూ కౌంటర్ ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వగా, వారు ఆధారాలతో సమాధానం ఇచ్చారన్నారు. ఈ సమస్యపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు స్థానిక నేతలతో కలిసి చర్చించి, ఇరు వర్గాల మధ్య సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

# తెలంగాణ పల్లెలకు భారీ ఊతం.. రూ.9,968 కోట్లు కేటాయించిన కేంద్రం




తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి, అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి రాష్ట్రానికి రూ.9,968 కోట్లను గ్రాంట్‌గా నిర్దేశించింది. ఈ నిధులను కేవలం గ్రామాల అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని, జీతభత్యాలు, పెన్షన్ల కోసం వాడరాదని స్పష్టమైన, కఠినమైన నిబంధనలు విధించింది.గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, వీధి దీపాల వంటి ప్రజా సేవల కోసమే ఈ నిధులను ఖర్చు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్ఠమైన పర్యవేక్షణ విధానాలను ప్రవేశపెట్టింది. ప్రతి స్థానిక సంస్థ తమ ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. త్రైమాసిక, వార్షిక నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి, అక్కడి నుంచి కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. ఆడిట్‌లో లోపాలుంటే సరిదిద్దాలని, అవకతవకలు రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.4,35,236 కోట్లను ఆర్థిక సంఘం కేటాయించింది. ఈ నిధులలో 80 శాతం నేరుగా గ్రామ పంచాయతీలకు, 10 శాతం మండల పరిషత్‌లకు, మరో 10 శాతం జిల్లా పరిషత్‌లకు అందజేస్తారు. ఏటా జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతలుగా ఈ గ్రాంట్లను విడుదల చేస్తారు. అయితే, మొత్తం నిధుల్లో 20 శాతం కేటాయింపులు స్థానిక సంస్థల పనితీరుపై ఆధారపడి ఉంటాయి. పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.నిధుల విడుదల ప్రక్రియ కూడా స్పష్టంగా నిర్దేశించారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు చేరిన నిధులను పది పనిదినాల్లోగా స్థానిక సంస్థల ఖాతాలకు బదిలీ చేయాలి. మొదటి విడత నిధులు పొందాలంటే, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ వివరాలు, 2025-26 ఆడిట్ నివేదికలను సమర్పించాలి. ఎన్నికలు జరిగి, ప్రజాప్రతినిధులు ఉన్న సంస్థలకు మాత్రమే ఈ గ్రాంట్లు వర్తిస్తాయి. నిధుల వినియోగంపై గ్రామసభల్లో, పరిషత్ సమావేశాల్లో తీర్మానాలు చేసి, వాటిని ఇ-గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరి.

# ప్రేమ్ ఇండియా బెస్ట్ కలెక్టర్ సర్వే లో ఎంపికైన నారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన షేక్ హాజీ బాబా

### మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 25:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా మాట్లాడుతూ ప్రేమ్ ఇండియా బెస్ట్ కలెక్టర్ సర్వే లో ఎంపికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీ చింతకుంట నారాయణ రెడ్డి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పెట్రోల్ బంక్‌లో పనిచేసే స్థాయి నుంచి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన ఆయన జీవిత ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఆయనకు సంబంధించిన పూర్తి వ్యక్తిగతవివరాలు

పూర్తి పేరు: చింతకుంట నారాయణ రెడ్డి (శ్రీపురం నారాయణ రెడ్డి)

పుట్టిన తేదీ: 01 అక్టోబర్ 1982

స్వస్థలం: శ్రీపురం గ్రామం, నర్వ మండలం, నారాయణపేట జిల్లా (పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా)

కుటుంబ నేపథ్యం: వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు చింతకుంట చెన్నారెడ్డి, నర్సింగమ్మల ఆరో సంతానం.

విద్యాభ్యాసం కష్టాల ప్రయాణం

ప్రాథమిక విద్య: స్వగ్రామమైన శ్రీపురంలో 1 నుండి 5వ తరగతి చదివారు. ఆ తర్వాత నర్వ, జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లలో పైచదువులు కొనసాగించారు.

ఆర్థిక ఇబ్బందులు: డిగ్రీ చదివే రోజుల్లో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల రాత్రి వేళల్లో పెట్రోల్ బంక్‌లో అటెండెంట్‌గా పని చేస్తూ పగలు కాలేజీకి వెళ్లేవారు.

ఉద్యోగ మరియు ఐఏఎస్ ప్రస్థానం

గ్రూప్-1 విజయం: కష్టపడి చదివి 2009లో తన మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు.


ఐఏఎస్ పదోన్నతి: రాష్ట్ర సివిల్ సర్వీసెస్ విభాగం నుండి ఆయన సమర్థత ఆధారంగా 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా పదోన్నతి (కన్ఫర్డ్ ఐఏఎస్) పొందారు.

నిర్వహించిన బాధ్యతలు:

గతంలో ములుగు జిల్లా కలెక్టర్‌గా, ఆ తర్వాత నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా సమర్థవంతంగా సేవలు అందించారు.

వికారాబాద్ జిల్లాలోనూ విధులు నిర్వహించారు.

ప్రస్తుత హోదా: అక్టోబర్ 2024 నుండి అధికారికంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు నారాయణరెడ్డి నీ నేటి యువత ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదివి మంచి ఫలితాలు సంపాదించి మంచి ఉద్యోగాలు చేయాలని మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ తరపున కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ తరపున కలెక్టర్ నారాయణరెడ్డి ప్రేమ్ ఇండియా బెస్ట్ కలెక్టర్ సర్వే లో ఎంపికైనందుకు మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ తరుపున కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు



# పౌష్టికాహారంతోనే ఆరోగ్య రక్షణ మహిళా వారోత్సవాల్లో కలెక్టర్ పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 25:-

రంగారెడ్డి జిల్లా: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో భాగమైన పోషకాహార మిషన్ కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలను పరిశీలించి వాటి రుచిని ఆస్వాదించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు ఇలాంటి పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమని సూచించారు.

కార్యక్రమంలో మాట్లాడుతూ మార్చి 6 నుంచి ప్రారంభమైన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి వారం ప్రత్యేక అంశాలతో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల అన్ని కార్యక్రమాలు సఫలమయ్యాయని చెప్పారు. ఇదే విధంగా మహిళా వారోత్సవాలను కూడా సమిష్టిగా



నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు.

నాణ్యమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ వివరించారు. సేంద్రీయ విధానంలో పండించిన ఆహారాన్ని వినియోగించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు పోషకాహార పదార్థాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఈ పోషకాహార మేళాను నిర్వహించినట్లు వెల్లడించారు.

అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆరోగ్యమే మనిషికి అసలైన సంపద అని, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. సరైన ఆహారం తీసుకుంటే అనేక రకాల వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు.

మహిళా వారోత్సవాల్లో భాగంగా పోషకాహార ఆహార ప్రదర్శనలు, అంగన్‌వాడీ లబ్ధిదారులు మరియు తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు నిర్వహించారు. సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలపై చార్టుల ద్వారా వివరించారు.

ఆరోగ్య శాఖ సహకారంతో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి, ఐరన్‌ఫోలిక్ ఆమ్ల మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మరియు జిల్లా మహిళా సంక్షేమ అధికారి శ్రీలత, ప్రధాన ప్రణాళిక అధికారి సౌమ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, వయోజన విద్య ఉప సంచాలకురాలు అనిత, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, సీడీపీవో శాంతికుమారి, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అందుకున్న చిన్నారి సమీక్ష

### మల్టీ టాలెంటెడ్ గా గుర్తింపు పొందిన సమీక్ష అకాడమీ







హైదరాబాద్ ఎస్టేట్ 25మే మంచిర్యాల

మయూరి ఆర్ట్స్ ప్రజెంటేషన్ బై యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ 24 మే 2026 రోజున ఉదయం 9 గంటల నుండి 5 గంటలకు వరకు హైదరాబాదులో శ్రీ త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్లో మయూరి యాడ్స్ వారి ఆధ్వర్యంలో నాన్ స్టాప్ ఈ రికార్డు చేయడం జరిగింది. ఇందులో 24 జిల్లాల నుండి 365 చిన్నారులు పాల్గొనడం జరిగింది. ఇందులో రామకృష్ణాపూర్ పట్టణం కి చెందిన సమీక్ష యాడ్స్ అకాడమీ హాట్సాఫ్ లైఫ్

శిక్షణ పొందుతున్న 12 సంవత్సరాల చిన్నారి సమీక్ష ఈ కార్యక్రమంలో తన యొక్క ఫోక్ డాన్సులెంట్ ని చూపించి రికార్డును మెడల్ అవార్డ్ అందుకోవడం జరిగింది. పిట్ట కొంచెం కూతగనం రెండున్నర సంవత్సరాల నుండి పలు రంగాలలో తన ప్రదర్శనలను ఇవ్వడమే కాకుండా ఈరోజు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికన్ బుక్ ఆఫ్ ఓల్డ్ రికార్డును అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మయూరి ఆడ్స్ ఫౌండర్ రాధా మరియు ఇంటర్నేషనల్ సెక్రెటరీ యూఎస్ఏ. .టామ్ వాషింగ్టన్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఇండియా. డా. అవినాష్, డి .శకుండే

చేతుల మీదుగా చిన్నారి సమీక్ష రికార్డును అవార్డును మెడల్ను అందుకోవడం జరిగింది.

దీనితోపాటు సమీక్ష యాడ్స్ అకాడమీ మల్టీ టాలెంటెడ్ అకాడమీగా రికార్డు నమోదు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెయ్యి మంది చిన్నారులు తల్లిదండ్రులు మరియు గురువులు పాల్గొన్నారు. సమీక్ష యాడ్స్ అకాడమీ ఫౌండర్ మెర్సీ రాణి మాట్లాడుతూ అకాడమీ అండ్ సమీక్ష కి రికార్డ్ అందుకున్నందుకు గురువులకు మరియు మయూరి ఆర్ట్స్ అకాడమీ వారికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చైర్ పర్సన్ కి అందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. చిన్నారి సమీక్షను అభినందించడం జరిగింది

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 మంగళవారం మే 2026

# కార్మికులకు కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించడంలో ఏరియా హాస్పిటల్ పాత్ర కీలకమైనది.



హైదరాబాద్ ఎస్టేట్ 25 మే
మంచిర్యాల జిల్లా మందమర్రి, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సి&ఎండి) డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు, సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో మల్టీ డిపార్ట్మెంటల్ సమీక్ష సమావేశాలను విస్తృతంగా నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు మందమర్రి ఏరియా పరిధిలోని అత్యంత కీలకమైన, నాణ్యమైన వైద్య సేవలకు నిలయమైన “ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్“ లో వైద్యులు, పారామెడికల్ మరియు అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులతో ప్రత్యేక మల్టీ డిపార్ట్మెంటల్ సమీక్షా సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో అధికారులు హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ అత్యంత వ్యూహాత్మకమైన మరియు కీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు. ఎంతో సుదీర్ఘమైన చరిత్ర, నమ్మకమైన వైద్య సేవల రికార్డు కలిగిన ఈ ఆసుపత్రి, రాత్రి పగలు తేడా లేకుండా ఉద్యోగుల శ్రేయస్సే ధ్యేయంగా నిరంతరం అచంచలమైన సేవలను అందిస్తూ ఏరియాకు ప్రధాన ఆరోగ్య వనరుగా నిలిచిందని కొనియాడారు. అత్యవసర సమయాల్లో మరియు క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితుల్లోనూ వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ తమ నైపుణ్యంతో ప్రాణాలను కాపాడుతూ అందిస్తున్న సేవలు అమోఘమైనవని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో అధునాతన వైద్య సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ, హాస్పిటల్ నిర్దేశించుకున్న హెల్త్ కేర్ లక్ష్యాలను సాధించి, సంస్థలోనే ఆదర్శవంతమైన ఏరియా ఆసుపత్రిగా అగ్రగామిగా నిలవాలని పిలుపునిచ్చారు ఈ విస్తృత స్థాయి సమావేశాలలో కంపెనీ నిర్దేశించుకున్న నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పాదకత, వైద్య సేవల విస్తరణ లక్ష్యాల సాధనపై సుదీర్ఘంగా చర్చించారు. ఆసుపత్రిలో సురక్షితమైన, పరిశుభ్రమైన పని వాతావరణం, శాస్త్రీయ ఆరోగ్య రక్షణ పద్ధతుల పెంపుదల, సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల మరియు రోగుల కొరకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, మందుల లభ్యత మరియు ఆర్థిక (ఫైనాన్స్) సంబంధిత విషయాలను అధికారులు ఉద్యోగులకు వివరించారు. అదేవిధంగా హాస్పిటల్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, రాబోయే రోజుల్లో ఎదుర్కోబోయే సవాళ్లు మరియు వాటిని అధిగమించి రోగులకు మెరుగైన ఓపి మరియు ఐపి సేవలను ఎలా అందించాలో చర్చించారు. అనంతరం సూచనలు పాటించడం ద్వారా వైద్య సేవల నాణ్యతను మరింత పెంచవచ్చని అధికారులు పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తమ ఉద్యోగులకు అందించే ఉచిత వైద్య సహాయంలో నాణ్యతను మరింత మెరుగుపరచడానికి సమగ్ర నాణ్యతా నియంత్రణ చర్యలను చేపట్టిందని, రోగులకు అత్యుత్తమ శ్రేణి చికిత్సను అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని అన్నారు. వైద్య సేవలు అందించే క్రమంలో నాణ్యత మరియు రోగుల భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ అందించే చికిత్సా ప్రమాణాలకు ఎంతో మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీమ్ పర్సనల్ .అశోక్, డీజీమ్ ఐ ఈ డి కిరణ్ కుమార్, ఏరియా హాస్పిటల్ రామకృష్ణాపూర్ డివై .సీఎంఓ మధుకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, హాస్పిటల్ వైద్య సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పండించిన పంటను కొనడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన నిమ్మ అంజిరెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 25
బిజెపి మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు ఈరోజు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మండల పరిధిలోని రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి మండల తాసిల్దార్ గారు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ కి రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది

ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కిసాన్మోర్చా నాయకులు పల్లె కృష్ణ గౌడ్ మాజీ మండల అధ్యక్షుడు జిట్టా రాజేందర్ రెడ్డి పాల్గొని రైతుల సమస్యల గురించి మాట్లాడుతూ

యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు కొనుగోలు: కేంద్రాల్లో తక్షణమే కాంటాలు, గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి ప్రతి గింజను వెంటనే కొనుగోలు చేయాలి. దోపిడీపై కఠిన చర్యలు: తరుగు తేమ మరియు తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టి దళారులపై కొనుగోలలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం కట్టిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మౌలిక వసతుల కల్పన: అకాల వర్షాల వల్ల పంట తడిసిపోకుండా తగినన్ని తార్పాలిన్లు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస వసతులు కల్పించాలి.సకాలంలో చెల్లింపులు: దాన్యం లిఫ్టింగ్ చేసిన వెంటనే ఆలస్యం లేకుండా వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. “కొనుగోలు కేంద్రాల్లో రైతు కన్నీళ్లు తుడవల్సిన బాధ్యత పరిపాలన యంత్రాంగం పై ఉంది రైతు రోడ్డెక్కిన తర్వాత స్పందించడం కాదు రైతు రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి రాకుండా చూడటమే నిజమైన పరిపాలన.” కావున తాము తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఈ వ్యవసాయ సంక్షోభం నుండి రైతాంగాన్ని కాపాడడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భారతీయబ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము లేని పక్షంలో రైతుల పక్షాన బిజెపి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో మండల




ప్రధాన కార్యదర్శి చిలుకల రఘునందన్ పార్టీ సీనియర్ నాయకులు మాస్ అన్న గారికి వెంకట్ రెడ్డి దాసర్లపల్లి సర్పంచ్ బాల్ రాజ్ పులి మామిడి సర్పంచ్ రమేష్ మండల ఉపాధ్యక్షుడు ఇంద్రకంటి రవీందర్ గౌడ్ మాజీ ఉపాధ్యక్షుడు సురసాని భూమిరెడ్డి జైత్వారం ఉపసర్పంచ్ నవీన్ పులిమామిడి ఉపసర్పంచ్ రాములు మండల పార్టీ సీనియర్ నాయకులు పెండ్యాల భాస్కర్ యువమోర్చా నాయకులు సామల దయాకర్ రెడ్డి నరసింహా మల్లేష్ మైసయ్య తదితరులు పాల్గొన్నారు

# టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం.. బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) కీలక అడుగు వేసింది. ‘బస్సులో భరోసా‘ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బస్సుల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఈ పైలట్ ప్రాజెక్టును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించింది. ఈ పైలట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్ రీజియన్‌లోని 175 బస్సుల్లో హైటెక్ నిఘా కెమెరాలను అమర్చారు. పోలీసు శాఖ సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా బస్సుల్లోని దృశ్యాలను ఆర్టీసీ కంట్రోల్ రూమ్ నుంచి




నిరంతరం పర్యవేక్షిస్తారు. బస్సుల్లో దొంగతనాలు, మహిళలపై వేధింపులు, పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధులకు ఈ వ్యవస్థ భరోసా కల్పించనుంది. ఈ కార్యక్రమంపై టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఈ కెమెరాలు ఒక ‘రక్షణ కవచం‘లా పనిచేస్తాయని తెలిపారు. ఈ కెమెరాల ఏర్పాటుతో ప్రయాణికులకు భద్రత పెరగడంతో పాటు, సిబ్బంది పనితీరులో జవాబుదారీతనం కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో అమలవుతున్న ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను సమీక్షించి, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సుల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## విఓఏ ల ( వివో ఏ ) న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి – శ్రీరాములు అందెల

### విఓఏ ల ( వివో ఏ) సమ్మెకు మద్దతుగా శ్రీరాములు అందెల

హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 25:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం లోని మహేశ్వరం మండలానికి సంబంధించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (ఐకెపి) పరిధిలో పనిచేయుచున్న విఓఏ లు గత వారం రోజులుగా మండల కేంద్రంలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్న నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు మండల కేంద్రానికి చేరుకొని వారి సమ్మెకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విఓఏ లకు ఇచ్చినటువంటి హామీలు వెంటనే అమలు చేయాలని...వారిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వెంటనే అమలు అమలు చేసి గౌరవ వేతనం నెలకు 26,000 గా వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు యాదిష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కడారి జంగయ్య యాదవ్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి మునావత్ పాండు నాయక్, రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్, జిల్లా సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, హనుమంతు నాయక్, మండల ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, సర్పంచ్ లు యాదయ్య, వినోద్ నాయక్, ఉపాధ్యక్షులు రూప్ సింగ్, నరసింహ ముదిరాజ్, సాయినాథ్, యాదయ్య, మాజీ సర్పంచ్ కాసుల సురేష్, మాజీ ఎంపిటిసి కృష్ణా నాయక్, గిరిజన మోర్చా అధ్యక్షులు కృష్ణా నాయక్, దళిత మోర్చా అధ్యక్షులు మాధవ్, కడారి దుర్గాప్రసాద్, బీజేవైఎం నాయకులు కుండే సురేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్ర రథసారథి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి జన్మదినం సందర్భంగా వనస్థలిపురం ప్రభుత్వ హాస్పిటల్లో పండ్లు పంపిణీ చేసిన జూకురి చైతన్య రాజు



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి, వనస్థలిపురం
టీపీసీసీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా వనస్థలిపురం లోని ప్రభుత్వ హాస్పిటల్లో రోగులకు పండ్లు పంపిణీ చేసిన ప్రసిద్ధి హాస్పిటల్ ఫౌండేషన చైర్మన్,టిపిసిసి జనరల్ సెక్రటరీ డాక్టర్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ జూకూరి చైతన్య రాజు గారి ఆధ్వర్యంలో వనస్థలిపురం ప్రభుత్వ హాస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణి చేసినారు

## “రైజ్ అప్ “అంతెం ఆడియో సిడి ఆవిష్కరణ




హైదరాబాద్, మే 25: వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ తెలంగాణ స్టేట్ చైర్మన్ లయన్ మట్ట నాగరాజు ఆధ్వర్యంలో రూపొందించిన కన్స్యూమర్ రైట్స్ “రైజ్ అప్ “అంతెం ఆడియో పాటను ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఎస్ రామానుజ స్వామి ఆవిష్కరించారు. “రైజ్ ఆఫ్ “అంతెం స్విచ్ ఆన్ చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంస్థ చేసే పనుల గురించి వివరించారు. తెలంగాణ రాష్ట్ర చైర్మన్ లయన్ మట్ట నాగరాజు మాట్లాడుతూ.. “రైజ్ అప్ “ అంతెం వెస్ట్రన్ సంగీతం ఇంగ్లీష్ లో క్షుణ్ణంగా పరిశీలించి రూపొందించామని పేర్కొన్నారు. నేటి యువత కి అర్థమయ్యే విధంగా స్వరపరచడం జరిగిందని తెలిపారు . వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 అంశాలను పరిగణలోకి తీసుకుని రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వర ప్రసాద్ చైర్మన్ అడ్మిన్, తెలంగాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## TNGOS పోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక చైర్మన్ గా దోనకొండ లక్ష్మణ్ రెడ్డి





( హైదరాబాద్ ఎస్టేట్ మే 25ప్ర)హనుమకొండ లోని 100 ఫీట్ల రోడ్ టీఎన్జీవోస్ కాలనీ ఫేస్ 2 లో గల పోచమ్మ తల్లి ఆలయ కమిటీ ఎన్నిక ఆదివారం సాయంత్రం నిర్వహించడం జరిగింది కాలనీ అధ్యక్షులు ఫోర్ రెడ్డి సుధాకర్ రెడ్డి కార్యదర్శి రమేష్ బాబు ఆధ్వర్యంలో పోచమ్మ కమిటీ నియామకం చేపట్టడం జరిగింది ఇట్టి కమిటీ ఎన్నికకు బైరెడ్డి మల్లారెడ్డి, నల్లాల రాజి రెడ్డీ,మధుకర్ రావు గారు ఎన్నికల అధికారులుగా నియమించుకొని కాలనీ పెద్దల సమక్షంలో పోచమ్మ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది పోచమ్మ కమిటీ చైర్మన్ గా దొనకొండ లక్ష్మారెడ్డి ప్రధాన కార్యదర్శిగా రాచర్ల కిరణ్ ఉపాధ్యక్షులుగా కిషన్ రెడ్డి, నారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా అర్జుల శ్రీధర్ రెడ్డి, రాజా రమేష్ కోశాధికారిగా బిక్షపతి గారు గౌరవ సలహాదారులుగా ఆవుల రాంరెడ్డి, బొద్దిరెడ్డి సతీష్ రెడ్డీ గార్లను మరియుజుఎ మెంబర్లు గా శ్రీధర్చారి పాలెపు రాజు రమేషు మంజుల గారిని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆలయం కమిటీ చైర్మన్ దొనకొండ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ పెద్దలు అందరి సహకారంతో ఆలయం యొక్క అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి స్లాప్ పోయించిన సర్పంచ్ దేవేందర్ నాయక్



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 25:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో.. నూతన గ్రామపంచాయతీ భవనానికి స్లాబ్ వేయించడం జరిగిందన్నారు 99 రోజులలో ప్రజా ప్రాణ అలీఖా భాగంగా జూన్ రెండున రెండో విడత ఇందిరమ్మ ఇల్లు 5 లక్షల ఉచిత భీమా పథకాలు మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కెఎల్ఆర్ ఆధ్వర్యంలో... మహేశ్వరం మండలం తెలంగాణలో మొదటి స్థానంలో ఉంటుందని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం జరిగిందని గుర్తు చేశారు గ్రామపంచాయతీ భవనాలు రాక గ్రూప్ భవనాలు అంగన్వాడీ బిల్డింగ్ లాంటి పథకాలు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తో పాటు ఉప సర్పంచ్ మహేందర్ మాజీ ఎంపిటిసి పాండు నాయక్ వార్డు మెంబర్స్ ఎం రవి నాయక్ ఎం మోహన్ నాయక్ ఎం దేవానాయక్ ఎం ధర్మ గోపి ఎం శ్రీనివాస్ ఎం రాజు ఎం రాజేందర్ ఎంపీడీవో రవీందర్ రెడ్డి ఏఈ రాంప్రసాద్ తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
26 మంగళవారం మే 2026

# ప్రజావాణికి 101 ఫిర్యాదులు..

## సమస్యల పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 25 :- రంగారెడ్డి జిల్లా: ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 101 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం పరిశీలిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 37 ఫిర్యాదులు, ఇతర శాఖలకు సంబంధించిన 64 ఫిర్యాదులు అందగా, మొత్తం 101 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి (లోకల్ బాడీస్), వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్య రక్షణ

## మహిళా వారోత్సవాల్లో కలెక్టర్ పిలుపు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 25:- రంగారెడ్డి జిల్లా: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో భాగమైన పోషకాహార మిషన్ కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ కిరణ్మయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలను పరిశీలించి వాటి రుచిని ఆస్వాదించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు ఇలాంటి పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ మార్చి 6 నుంచి ప్రారంభమైన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి వారం ప్రత్యేక అంశాలతో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల అన్ని కార్యక్రమాలు సఫలమయ్యాయని చెప్పారు. ఇదే విధంగా మహిళా వారోత్సవాలను కూడా సమిష్టిగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. నాణ్యమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతో వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ వివరించారు. సేంద్రీయ విధానంలో పండించిన ఆహారాన్ని వినియోగించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ సిబ్బంది విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు పోషకాహార పదార్థాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఈ పోషకాహార మేళాను నిర్వహించినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఆరోగ్యమే మనిషికి అసలైన సంపద అని, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. సరైన ఆహారం తీసుకుంటే అనేక రకాల వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు. మహిళా వారోత్సవాల్లో భాగంగా పోషకాహార ఆహార ప్రదర్శనలు, అంగన్‌వాడీ లబ్ధిదారులు మరియు తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు నిర్వహించారు. సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారంపై అవగాహన కల్పిస్తూ తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు. జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలపై చార్టుల ద్వారా వివరించారు.ఆరోగ్య శాఖ సహకారంతో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి, ఐరన్‌ఫోలిక్ ఆమ్ల మాత్రలు పంపిణీ చేశారు. వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మరియు జిల్లా మహిళా సంక్షేమ అధికారి శ్రీలత, ప్రధాన ప్రణాళిక అధికారి సౌమ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, వయోజన విద్య ఉప సంచాలకురాలు అనిత, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, సీడీపీవో శాంతికుమారి, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మ సిటీ వద్దు... ఫ్యూచర్ సిటీయే ముద్దు కేఎల్ఆర్

## మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 25:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఫ్యూచర్ సిటీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న వ్యాఖ్యలను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"హరీష్ రావుకి పార్టీకి రాజకీయంగా ఫ్యూచర్ లేకపోవచ్చు కానీ తెలంగాణ యువతకు, భావితరాలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. కాబట్టి ఫ్యూచర్ సిటీ వద్దు అనడం పూర్తిగా ప్రజావ్యతిరేక ధోరణి" అని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ కారణంగా భూగర్భ జలాలు కలుషితమై, పరిసర గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రసాయన కాలుష్యం వల్ల అనేక గ్రామాల్లో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారని గుర్తు చేశారు.

అలాంటి ప్రమాదకర పరిస్థితులను అడ్డుకోవడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రజా సంఘాల నాయకుడు కోదండరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని తెలిపారు. ప్రజల ప్రాణాలు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఫార్మాసిటీ ప్రాజెక్టును నిలిపివేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న "గ్రీన్ ఫార్మా ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు పూర్తిగా పర్యావరణ హిత విధానాలతో.రూపొందించబడిందన్నారు. ఇతర ప్రాంతాల్లో తయారైన మందులు, వ్యాక్సిన్లను కేవలం రీఫిల్లింగ్, ప్యాకింగ్, నిల్వ వంటి కాలుష్య రహిత కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేసే విధంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించిందన్నారు.ఫ్యూచర్ సిటీ ద్వారా మహేశ్వరం నియోజకవర్గ ప్రాంతం అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి కేంద్రంగా మారబోతోందని కేఎల్ఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఉద్యోగ అవకాశాలు, ఆధునిక నివాస సముదాయాలు, స్కిల్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ, అంతర్జాతీయ విద్యాసంస్థలు, సూపర్ స్పెషాలిటీ మరియు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పడనున్నాయని తెలిపారు."మన పిల్లలు చదువు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండాడ ప్రపంచ స్థాయి అవకాశాలను తెలంగాణలోనే అందించాలన్నదే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని కేఎల్ఆర్ స్పష్టం చేశారు.అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాల కంటేడ ప్రజల భవిష్యత్తును నిర్మించే రాజకీయాలకు తెలంగాణ ప్రజలు ఎప్పుడూ మద్దతు ఇస్తారని ఆయన అన్నారు.

# ఇబ్రహీంపట్నంలో మట్టి లారీలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

## నిబంధనలు అతిక్రమించిన మట్టి లారీ డ్రైవర్లకు చలాన్లు..

## ట్రాఫిక్ సీఐ జితేందర్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 25:- ఇబ్రహీంపట్నం పరిధిలో మట్టి లారీలు నిర్లక్ష్యంగా నడపడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో పలువురు మట్టి లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా మట్టి లారీలకు పట్టాలు కప్పకుండా మట్టిని తరలించడం వల్ల రోడ్లపై దుమ్ము అధికంగా ఎగిసి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనివల్ల ప్రమాదాల అవకాశాలు కూడా పెరుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అంతేకాకుండా కొంతమంది డ్రైవర్లు అతివేగంగా లారీలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ఇతర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.తనిఖీల సందర్భంగా నిబంధనలు పాటించని లారీ డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించారు. అలాగే డ్రైవర్ల యూనిఫామ్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ పత్రాలు తదితర వివరాలను కూడా పరిశీలించారు. పత్రాలు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. మట్టి లారీ డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, మట్టిని తరలించే సమయంలో పట్టాలు కప్పి తీసుకెళ్లాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# గ్రామ అభివృద్ధికి సహకరించండి సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

## = బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

### అమీర్ పేట్, కల్వకోల్, పెండ్యాల, బీటీ రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి





( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారిమే 25:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం అమిర్ పేట్ కల్వకోల్ పెండ్యాల బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి సూచించారు ఆదివారం మండల్ పరిధిలోని కల్వకోల్ పెండ్యాల అమిర్ పెట్ బీడీ రోడ్డు నిర్మాణం పనులు ఆమె అధికారులు ప్రజాప్రతినితో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో తను మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదనలు పంపి అమిర్ పెట్ పెండ్యాల కల్వకోలు గ్రామ రైతులు ప్రజలు అసౌకర్యం బీడీ రోడ్డు నిర్మాణానికి 8 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశామని స్పష్టం చేశారు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి మట్టి దొరకపోవడంతో రోడ్డు పక్కన కొంత మంది రైతులు అభ్యంతరాలు తెలపడంతో పనులు ఆలస్యం జరిగాయి రోడ్డు పనులు నాణ్యతగా తొందరగా చేయాలని కాంట్రాక్టర్లు అధికారులను ఆదేశించారు వర్షాకాలం రాకముందే పనులు చేయాలని ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే కల్వకోల్ పెండ్యాల గ్రామస్తులు అమిర్ పెట్ వెళ్లడానికి సులభంగా ఉంటుందన్నారు అనంతారం అధికారులు కాంట్రాక్టర్లతో మాట్లాడి రోడ్డు పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మరియు మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి ఎమ్మెల్యేని కలిసి రోడ్డు పనులతో పాటు మా గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో... మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి , ఉప సర్పంచ్ జనార్దన్ గౌడ్, బక్కని రవి మాదిగ, బొజ్జం చంద్రయ్య, అరటి వెంకటేష్, పర్వతాల గౌడ్, గుర్రంపల్లి మల్లేష్, బడుసు ప్రవీణ్,బక్కని రాజు, జంపుల రాఘవేందర్, బొజ్జం కుమార్, అరడి రాఘవేందర్, తొంట రవీందర్, మధు రెడ్డి, బక్కని అశోక్, బండి రాజు, గూడెం కుమార్, ఆశపాలి శంకరయ్య, కావాలి శ్రీకాంత్, బడుసు, అనిల్, బక్కని సుమన్, బక్కని సిద్దేశ్, బక్కని భరత్ కుమార్, ఎర్ర నవీన్, తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన...ఎమ్మెల్యే




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)

మద్దిరాల మండల కేంద్రానికి చెందిన మెడుదుల యకస్వామి కుటుంబాన్ని పరామర్శించిన తుంగతుర్తి నియోజకవర్గ శాసన సభ్యులు మందుల సామెల్ అనంతరం ఆయన మాట్లాడుతూ యకస్వామి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అన్నదంటలతో ఉంటుందని వారన్నారు ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న మరియు జిల్లా కార్యదర్శి చామకూరి శ్రీనివాస్ మద్దిరాల కాంగ్రెస్ నాయకులు పి ఎ సి సి డైరెక్టర్ మట్టిపల్లి లింగయ్య మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ ఉమేష్ గజ్జి యాకయ్య భూతం లింగయ్య వల్లపు పరమేష్ దావీద్ రామలింగం జక్కి కోటేష్ తదితరులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

26 మంగళవారం మే 2026

# పరిశ్రమను కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది: బాలకృష్ణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటక అభివృద్ధి సంస్థ (APFDC) కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో హిందూపురం ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏపీని తెలుగు చిత్ర పరిశ్రమకు ఒక ప్రధాన కేంద్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 1975లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విభజన తర్వాత 2017లో ఏపీలో ప్రత్యేకంగా ఏర్పాటయిందని గుర్తుచేస్తూ.. ఇది ఇండస్ట్రీ అభివృద్ధికి ఒక కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లతో కలిసి తామంతా టాలీవుడ్ పురోగతి కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.తెలుగు సినిమాలకు వస్తున్న మొత్తం కలెక్షన్లలో సుమారు 70 శాతం ఆదాయం ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తోందని బాలకృష్ణ ఈ



సందర్భంగా తెలిపారు. ఏపీలో అద్భుతమైన సహజ సిద్ధమైన లొకేషన్లు ఉన్నాయని, తాను నటించిన 'అఖండ' సినిమా షూటింగ్‌ను కూడా రంపచోడవరంలోనే జరిపినట్లు ప్రస్తావించారు. "నేను చేసినన్ని సినిమాలు ఏపీలో బహుశా మరెవ్వరూ చేసి ఉండరు" అని చెప్పారు. షూటింగ్‌ల కోసం సింగిల్ విండో అనుమతుల విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.ప్రస్తుతం పరిశ్రమ ఎదుర్కొంటున్న సంక్షోభంపై బాలకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో టెక్నాలజీ లేనప్పుడే సినిమాలు త్వరగా పూర్తయ్యేవని, ఇప్పుడు సాంకేతికత పెరిగినప్పటికీ నిర్మాణంలో ఆలస్యం జరుగుతోందన్నారు. షూటింగ్‌లు తగ్గిపోవడంతో అనేక సినీ యూనియన్లు పనులు లేక ఇబ్బందులు పడుతున్నాయని, చాలామంది పంపిణీదారులు థియేటర్లకు తాళాలు వేసుకునే దారుణమైన పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు సినిమా ఎలా ఉండాలో ఆలోచించేవాళ్లం, కానీ ఇప్పుడు పరిశ్రమను బ్రతికించాల్సిన పరిస్థితి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. నిర్మాతలు ఎక్కువ సినిమాలు తీసి థియేటర్లను బ్రతికించాలని పిలుపునిచ్చారు.

# జిటల్ ప్రపంచంలోకి చిరంజీవి



దశాబ్దాలుగా వెండితెరపై కోట్లాది మంది అభిమానులను తన నటనతో, డాన్సులతో అలరించిన మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు సరికొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. తొలిసారిగా ఆయన డిజిటల్ ప్రపంచంలోకి (రాబు) అడుగుపెట్టబోతున్నారనే వార్త ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒక ప్రతిష్టాత్మక పోడ్‌కాస్ట్ (రాశీసఝర్) టాక్ షో ద్వారా ఆయన త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. శూన్యం నుంచి ప్రయాణాన్ని ప్రారంభించి, ఒక సాధారణ వ్యక్తి తెలుగు సినిమా ఇండస్ట్రీని శాసించే మెగాస్టార్ స్థాయికి ఎలా ఎదిగారు? ఆ ప్రయాణంలో ఆయన ఎదుర్కొన్న సవాళ్లు, కష్టాలు, ఎవరికీ తెలియని తెరవెనుక ఆసక్తికర సంఘటనలు, విజయాల వెనుక ఉన్న అసలు కథలను ఈ పోడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి స్వయంగా అభిమానులతో పంచుకోబోతున్నారు. రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ షో ఉండబోతోంది.ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ రచయిత, దర్శకుడు బి.వి.ఎస్. రవి రూపొందిస్తున్నారు. గతంలో నందమూరి బాలకృష్ణ హోస్ట్ చేసిన 'అన్‌స్టాపబుల్' షోను తన రైటింగ్, కంటెంట్‌తో సూపర్ హిట్ చేసిన ఆయన.. ఇప్పుడు చిరంజీవి ప్రాజెక్ట్‌కు బాధ్యతలు చేపట్టడం అంచనాలను మరింత పెంచేసింది.ఈ పోడ్‌కాస్ట్ గురించి గతంలో చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల కూడా కొన్ని హింట్స్ ఇచ్చారు. గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్ తెరకెక్కే అవకాశం కనిపిస్తోంది. బి.వి.ఎస్. రవి కూడా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని పరోక్షంగా ధృవీకరించారు. అయితే ఈ షోలో ఎవరెవరు గెస్టులుగా పాల్గొంటారు? చిరంజీవితో కలిసి పనిచేసిన స్టార్ డైరెక్టర్లు, నిర్మాతలు, తోటి నటీనటులు ఇందులో కనిపిస్తారా? లేక ఆయన కెరీర్‌లోని ఇండస్ట్రీ హిట్ చిత్రాలను బేస్ చేసుకుని ఎపిసోడ్‌లను డిజైన్ చేస్తారా? అనే అంశాలపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఏదేమైనా వెండితెరపై బాక్సాఫీస్ రికార్డులను షేక్ చేసిన మెగాస్టార్.. ఈ కొత్త డిజిటల్ ఇన్నింగ్స్‌తో ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లో ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తారో చూడాలి.

# ఆ హీరో శివుడైతే? అతడి కోసం పార్వతి సిద్ధం!

-ఆశ్రమ్- వెబ్ సిరీస్ తో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి త్రిధా చౌదరి. భవిష్యత్తులో తాను నటించాలనుకుంటోన్న కలల ప్రాజెక్టుల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కంటెంట్ ఆధారిత చిత్రాలలో నటించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అమ్మడు పౌరాణిక - చారిత్రక నేపథ్యం ఉన్న కథలపై తనకున్న మక్కువను బయటపెట్టారు. భారీ స్థాయిలో రూపొందే ఓ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగం కావాలనేది తన చిరకాల కోరిక అని తెలిపారు.

భారతీయ సాహిత్య రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన అమిష్ త్రిపాఠి రచించిన -శివ త్రిలోజీ- పుస్తకాల ఆధారంగా తెరకెక్కే చిత్ర విశ్వంలో నటించడమే ప్రధాన లక్ష్యమని త్రిధా పేర్కొన్నారు. తనకు మొదటి నుండి శివుడంటే అపారమైన భక్తి, గౌరవం ఉన్నాయన్నారు . ఈ ఐకానిక్ నవలను వెండితెరపై ఆవిష్కరించే క్రమంలో వచ్చే పౌరాణిక పాత్ర ఏదైనా సరే? అందులో నటించడం నటిగా తనకు లభించే అద్భుతమైన అవకాశమని ఆమె భావిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్ కెరీర్‌కు మైలురాయిగా నిలుస్తుందని నమ్ముతున్నారు.


ఈ కలల ప్రాజెక్టుపై ఆమెకు మరింత ఆసక్తి పెరగడానికి బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కూడా ఓ కారణమని త్రిధా వెల్లడించారు. అమిష్ త్రిపాఠి -శివ త్రిలోజీ- సినిమా హక్కులను రణ్‌వీర్ సింగ్ సొంతం చేసుకున్నారని తెలిసిందని, ఆయనతో కలిసి పనిచేయడానికి తాను ఎంతో ఉత్సాహంగా ఉన్నానన్నారు. రణ్‌వీర్ సింగ్‌కు పెద్ద అభిమానినని, ఆయన నటనలోని ఎనర్జీ ఎంతో ఇష్టమన్నారు. లార్డ్ శివ కాన్సెప్ట్, రణ్‌వీర్ తో కలిసి నటించే పౌరాణిక చిత్రంలో అవకాశం వస్తే నిజంగా తన కల సాకారమవ్వడమేనని ఆనందం వ్యక్తం చేశారు.

త్రిధా చౌదరి కెరీర్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే అమ్మడు ఒకే భాషకు పరిమితం కాలేదు. హిందీ, బెంగాలీ , తెలుగు చిత్ర పరిశ్రమల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రముఖ దర్శకుడు శ్రీజిత్ ముఖర్జీ రూపొందించిన బెంగాలీ చిత్రం -మిషావర్ రావశ్యో-తో వెండితెరకు పరిచయమైన అమ్మడు ఆ తర్వాత పలు డిజిటల్, టెలివిజన్ ప్రాజెక్టులతో మెప్పించారు. తాజాగా సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన -ఆఖరి సవాల్-చిత్రంలో కూడా కీలక పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

గ్లామర్ ప్రపంచంలో నటీమణులకు బాహ్య సౌందర్యం ఎంత ముఖ్యమో? అంతకంటే మిన్నగా నటనకు లభించే గుర్తింపు ముఖ్యమని త్రిధా అభిప్రాయపడ్డారు. ఎంత గ్లామరస్‌గా కనిపించినా? తాము పోషించే పాత్రకు పూర్తి న్యాయం చేయలేకపోతే ఆ ప్రదర్శన నిరర్థకమవుతుందన్నారు. నటిగా పాత్రలోని లోతును అర్థం చేసుకుని, దానికి ప్రాణం పోయడమే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.




# ఆ వైరల్ వీడియో, ఫొటోలు నావి కావు.. బాధ్యులపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: రుక్మిణి వసంత్




సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు."నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.


# ఆ సమయంలో చాలా సిగ్గుగా అనిపించింది: నాగార్జున



తాను ఐదో తరగతి చదువుతున్నప్పుడు ఒక డ్రామాలో ఆడవేషం వేయించారని, అప్పుడు అందరూ తనను చాలా ఎగతాళి చేశారని ప్రముఖ సినీ నటుడు నాగార్జున అన్నారు. ఆ సమయంలో తనకు చాలా సిగ్గుగా అనిపించిందని పేర్కొన్నారు. నాగార్జున సినిమా పరిశ్రమకు వచ్చి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తన సినీ ప్రయాణం గురించి చెప్పుకొచ్చారు. తాను నటుడిని అవుతాననే చెప్పే ఆనవాళ్లు తన బాల్యంలో ఏవీ లేవని అన్నారు.తనకు మూడు సంవత్సరాలు ఉన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చేశామని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదివానని, కానీ స్టార్ హీరో నాగశ్వరరావు కొడుకును అనే ప్రత్యేక శ్రద్ధ ఏమీ ఉండేది కాదని అన్నారు. తాను సగటు విద్యార్థిని అని, చదువులో మొదటి ఇరవై స్థానాల్లో ఉండేవాడినని అన్నారు. ఆడవేషం వేసినప్పుడు తనను ఎగతాళి చేయడంతో తాను మళ్లీ డ్రామాల జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు.సుడిగుండాలు చిత్రంలో 30 సెకన్లు మాత్రమే కనిపించే చిన్న పాత్ర వేశానని, తాను మేకప్ వేసుకోవడం అదే మొదటిసారి అన్నారు. చదువు పూర్తయ్యాక ఏడాదిన్నర పాటు అమెరికాలో ఉన్నానని అన్నారు. అక్కడే సెటిల్ అవుదామని ఎప్పుడూ అనుకోలేదని వెల్లడించారు. ఇక్కడకు వచ్చి ఏదైనా వ్యాపారం చేద్దామనుకున్నానని, అప్పుడు ఏదైనా లైసెన్స్ కావాలంటే ఏడాది సమయం పట్టేదని అన్నారు.అందుకే తాను ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి దిగానని చెప్పారు. అప్పుడే తన అన్నయ్య వెంకట్, తనను సినిమాల్లో నటించమని సూచించాడని పేర్కొన్నారు. అప్పటి వరకు తనకు నటన మీద ఆసక్తి లేదని, కానీ అన్నయ్య చెప్పాక ఆలోచించానని తెలిపారు. 1986లో మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైందని, అది మంచి విజయం సాధించినప్పటికీ విమర్శలు వచ్చాయని అన్నారు. తనను నాన్న గారితో పోల్చి చూడటంతో విమర్శలు వచ్చాయని అన్నారు. సినిమాల్లో జీన్స్ వేసుకోవడం తనతోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు.

# చాక్లెట్ డ్రెస్ లో ప్రగ్యా జైస్వాల్ 'కోకో' మ్యాజిక్!

తెలుగు తెరపై 'కంచె'తో క్లాస్ లుక్, 'అఖండ'తో మాస్ హిట్ అందుకున్న పొడుగుకాళ్ల సుందరి ప్రగ్యా జైస్వాల్, సోషల్ మీడియాలో మరోసారి హీట్ పెంచేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన "కోకో కోచర్" ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. చాక్లెట్ బ్రౌన్ కలర్ డ్రెస్సులో మెరిసిపోతున్న ప్రగ్యా..మరి ఆ అద్భుతమైన డ్రెస్ విశేషాలు మీకోసం.. చాక్లెట్ బ్రౌన్ డ్రెస్సులో రాయల్ లుక్: ప్రగ్యా ఈసారి ఎంచుకున్న డ్రెస్ చాలా వెరైటీగా ఉంది. ప్రముఖ డిజైనర్ బబితా మల్కాని డిజైన్ చేసిన ఈ 'చాక్లెట్ బ్రౌన్ కోచర్' డ్రెస్ ఆమె ఫిగర్‌కు పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ఇక ప్రీమియం సాటిన్ మరియు ఫాయిల్ జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన ఈ గౌన్, ప్రగ్యాకు ఒక లగ్జరీ లుక్‌ను ఇచ్చింది. ముఖ్యంగా ఆ డ్రెస్సు రంగు ఆమె స్కిన్ టోన్‌కు మరింత గ్లోను జోడించింది.డిజైన్ హైలైట్స్ ఇవే: ఈ డ్రెస్సులో డిజైనర్ చూపించిన క్రియేటివిటీ అద్భుతం. బాడీ పార్ట్ దగ్గర సన్నని పైపులు మరియు థ్రెడ్ ఎంబ్రాయిడరీతో మెరుపులు జోడించారు. హై సైడ్ స్లిట్ ఉండటంతో ప్రగ్యా మరింత గ్లామరస్‌గా కనిపిస్తోంది. ఇక ఒక వైపు నేలను తాకేలా ఉన్న లాంగ్ టెయిల్ ఈ డ్రెస్‌కు ఒక 'మోడరన్ యువరాణి' కళను తెచ్చిపెట్టింది. దీనికి తగ్గట్టుగా ఆమె ధరించిన జ్యువెలరీ కూడా హైలైట్‌గా నిలిచింది. కెరీర్ పరంగా ఎలా ఉందంటే?: సినిమాల విషయానికి వస్తే, ప్రగ్యా జైస్వాల్ కెరీర్‌లో కంచె, జయ జానకి నాయక, అఖండ వంటి మంచి హిట్స్ ఉన్నప్పటికీ, ఆమెకు సరైన బ్రేక్ రావడం లేదు. సీనియర్ హీరోల పక్కన ఆమె జోడీ బాగుంటుందని పేరున్నా, ప్రస్తుతం అదృష్టం కోసం వేచి చూస్తోంది. అయితే అవకాశాలు ఉన్నా లేకున్నా, సోషల్ మీడియా ద్వారా తన అభిమానులను మాత్రం అస్సలు బోర్ కొట్టించదు ఈ



అమ్మడు. ఇక ఇలాంటి ఫ్యాషన్ డ్రెస్సులు వేసుకోవడం, నచ్చినట్టుగా ఫోటో షూట్లు చేసుకోవడం వల్ల వచ్చే కాన్ఫిడెన్స్ మరియు ఆనందమే తన అందానికి రహస్యమని ఆమె పరోక్షంగా చెబుతోంది. ఆమె స్మైల్ మరియు కాన్ఫిడెన్స్ చూస్తుంటే అది నిజమే అనిపిస్తోంది.



ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ 'చాక్లెట్ బ్యూటీ' ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. డ్రెస్సు ఏదైనా దానికి తనదైన స్టైల్‌తో ప్రాణం పోయడం ప్రగ్యాకు వెన్నతో పెట్టిన విద్య. మరి త్వరలోనే ఈ అమ్మడు మళ్ళీ వెండితెరపై పెద్ద సినిమాలతో మెరవాలని కోరుకుందాం.